# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


ఓదెల : రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

- పెద్దపల్లి డీసీపీ కరుణాకర్
- యుద్ధం నేపథ్యంలో ఏలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండ పోలీసుల ముందస్తు తనిఖీలు

పెద్దపల్లి టౌన్, మే 11: భారత్–పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీసీపీ కరుణాకర్ సూచించారు. శనివారం రాత్రి పెద్దపల్లి రైల్వేస్టేషన్‌తో పాటు బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహిచారు. ఈ సందర్భంగా డీసీపీ కరుణాకర్ మాట్లాడారు. ప్రజల రక్షణ,భద్రత, చర్యల్లో భాగంగా సీపీ అంబర్ కిషోర్ ఝ ఆదేశాల మేరకు విస్తృత తనీఖిలు చేస్తున్నట్లు తెలిపారు. రైల్వేస్టేషన్, బస్టాండ్ రద్దీ ప్రదేశాల్లో బాంబ్ స్వాడ్, డాగ్ స్కాడ్, బృందాలతో పరిసరాలు పరిశీలిస్తు తనీఖిలు చేస్తున్నామని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, బ్యాగ్‌లు కనబడితే వెంటనే పోలీసులకు డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. భవిష్యత్‌లో ఏలాంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండ ఉండేందుకే ముందస్తు తనీఖిలు నిర్వహిస్తున్నట్లు డీసీపీ తెలిపారు. ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్‌కుమార్,ఎస్ఐలు లక్ష్మణరావు, మల్లేశ్, మధుకర్, నరేశ్‌కుమార్, బాంబ్, డాగ్ స్కాడ్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

## రైల్వే స్టేషన్లలో తనిఖీలు

ఓదెల, మే 11: ఓదెల మండలంలోని పలు రైల్వే స్టేషన్లలో ఆదివారం ప్రత్యేక పోలీసు బలగాలతో తనిఖీలను చేపట్టారు. పొత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేశ్ ఆధ్వర్యంలో బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో విస్తృతంగా తనిఖీలు చేశారు. ఓదెల, కొలనూర్, పొత్కపల్లి స్టేషన్‌లలో ప్రత్యేక పోలీసులు డాగ్‌స్క్వాడ్‌తో రైల్వే స్టేషన్‌ల పరిసరాలను తనిఖీ చేశారు. అనుమానస్పందంగా ఏదైన కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# కూల్చివేతలకు ఉత్సాహం...వెడల్పు పనులకు తాత్సారం

### ఆందోళనలో దుకాణాలు కోల్పోయిన బాధితులు


గోదావరిఖని కూరగాయల మార్కెట్ రోడ్డులో కూల్చివేసిన దుకాణాలు

కోల్‌సిటీ, మే 11:రామగుండం నగర పాలక సంస్థ అధికారులకు దుకాణాల కూల్చివేత విషయంలో చూపించిన ఉత్సాహం రోడ్డు వెడల్పు పనులపై చూపించడం లేదని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగర పాలక 31వ డివిజన్ పరిధిలోని ప్రధాన కూరగాయల మార్కెట్ రోడ్డును వెడల్పు, అభివృద్ధి పేరుతో కొద్ది రోజుల క్రితం హడావిడిగా నగర పాలక ఇంజనీరింగ్ విభాగం అధికారులు జేసీబీతో దుకాణాలను తొలగించారు. రోడ్డు వెడల్పు జరిగితే వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయని ఆశ చూపించారు. అందుకు వ్యాపారులు కూల్చివేతలకు సహకరించారు. తీరా చూస్తే రోడ్డు వెడల్పు పనుల విషయంలో రోజులు లెక్కబెడుతూ తాము జీవనోపాధి కోల్పోయామని వాపోతున్నారు. మరోప్రక్క మళ్లీ రోడ్డు పక్కన ఆక్రమణలు జరుగుతున్నాయి. అప్పటికి విశాలంగా ఉన్న రోడ్డును కావాలనే వెడల్పు పేరుతో ఎవరి స్వార్థం కోసమోనని నిర్ధాక్షిణ్యంగా దుకాణాలు తొలగించారని ఆరోపిస్తున్నారు. రోడ్డు పక్కన ఆక్రమణల వల్ల తమ వ్యాపారాలు నడవడలేని పరిస్థితి నెలకొందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా నగర పాలక సంస్థ కమిషనర్ జోక్యం చేసుకొని రోడ్డు నిర్మాణం పనులు త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు. ఈవిషయమై నగర పాలక సంస్థ ఎస్ఈ శివానందంను వివరణ కోరగా ముందుగా పైపులైను నిర్మాణం చేపట్టి తర్వాత 40 ఫీట్ల వెడల్పుతో రోడ్డు పనులు చేపడుతామనీ, మరో 20 రోజులు గడువు పట్టే అవకాశం ఉందని తెలిపారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

## రైతులకు అండగా ఉంటాం

పెద్దపల్లి, మే11: రైతులకు ఎలాంటి కష్టం వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణాణరావు అన్నారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఆయన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత కొద్ది రోజులుగా కురుస్తున్న ఆకాల వర్షాల వలన ధాన్యం తడిసిందని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని సేకరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షం కారణంగా ధాన్యం కిందకు వర్షపు నీరు చేరి ధాన్యం రంగు మారిందన్నారు. రైతులకు సరిపడా టార్ఫలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఇప్పటికే పెద్దపల్లి మార్కెట్‌లకు సుమారుగా 16వేల క్వింటాళ్ల ధాన్యం వచ్చిందని, ఇందులో 11వేల క్వింటాళ్లు మిల్లులకు తరలించినట్లు తెలిపారు. ఆయన వెంట మార్కెట్ కమిటి చైర్మన్ ఈర్ల స్వరూప, వైస్ చైర్మన్ కూర మల్లారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జడల సురేందర్, నాయకులు భూషణ వేన సురేష్ గౌడ్, నూగిల్ల మల్లయ్య, బూతగడ్డ సంపత్, అమ్రేష్, పాగాల శ్రీకాంత్, మసూద్ నదీంలు ఉన్నారు.


ఆర్థిక సాయం అందిస్తున్న మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీశ్

# అమ్మకు వందనం

కోల్‌సిటీ, మే 11: రామగుండం నగర పాలక సంస్థ ఓ మాజీ కార్పొరేటర్ తనలోని అమ్మ ప్రేమను వినూత్నంగా చాటుకున్నాడు. అందరిని కోల్పోయి అనాథలుగా మారి ఆశ్రమంలో జీవిస్తున్న వృద్ధుల వద్దకు వెళ్లి వారిని శాలువాతో సన్మానించి వారికి ఆర్థిక సహాయం అందజేసి శభాష్ అనిపించుకున్నాడు రామగుండం కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీశ్ కుమార్. మాతృ దినోత్సవం పురస్కరించుకొని తన తల్లి సౌందర్యమ్మను స్మరిస్తూ గోదావరిఖని బస్టాండ్ వద్ద గల మున్సిపల్ నైట్ షెల్టర్‌లోని వృద్ధ మహిళలను కలిసి వారితో కేక్ కట్ చేసి స్వీట్ తినిపించి మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వారిని శాలువాలతో సన్మానించి ఒక్కొక్కరికి ఆర్థిక సహాయం అందించి వారి కళ్లలో ఆనందం నింపాడు.కార్యక్రమంలో జ్యోతి గాంధీ ఫౌండేషన్ నిర్వాహకులు దయానంద్ గాంధీ, మిత్రులు పూదరి శ్రీనివాస్, ఎస్కే ఇంతియాజ్, సిరికొండ కోటి, నైట్ షెల్టర్ ఇన్‌ఛార్జి సమ్మయ్య పాల్గొన్నారు.



పెద్దపల్లి రైల్వే జంక్షన్ (ఫైల్)



చెన్నై భగత్‌కి కోఠి ఎక్స్‌ప్రెస్ రైలు

# కొత్త రైళ్లొస్తున్నా.. హాల్టింగ్‌లేవీ?

- పెద్దపల్లి జంక్షన్‌లో స్టాప్‌కు నోచుకోని ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు
- త్వరలో వచ్చే అమృత్‌భారత్‌కు నో స్టాప్
- అడియాసలైన ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల ప్రయాణికుల ఆశలు
- జంక్షన్‌లో హాల్టింగ్ ఇవ్వాలని డిమాండ్

పెద్దపల్లి, మే 11(నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో కొత్త రైళ్లు వస్తున్నా.. రాష్ట్ర ప్రజలకు మాత్రం పెద్దగా ప్రయోజనం కలుగడం లేదు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణలోని రైల్వే జంక్షన్లు, స్టేషన్లపై వివక్ష చూపుతుండడంతో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతున్నది. తాజాగా శనివారం కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కొత్త రైళ్లను ప్రారంభించగా, అందులో ఒక రైతు తెలంగాణ మీదుగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలకు వెళ్తుంది. జోధ్‌పూర్ నుంచి చైన్నైకి 20625/26 చెన్నై భగత్‌కి కోటి ఎక్స్‌ప్రెస్ రైలు వారానికి ఐదు రోజులు నడుస్తున్నది. ఈ రైలుకు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లోని ఒక్క రైల్వే జంక్షన్ గానీ, రైల్వేస్టేషన్లలో కానీ స్టాప్ ఇవ్వలేదు. మరికొద్ది రోజుల్లో పాట్నా నుంచి ఎస్ఎంవీటీ బెంగళూరు బై వీక్లీ 'అమృత్ భారత్' సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభంకానున్నది. ఈ రైలుకు కూడా బల్లార్షా నుంచి వరంగల్ మధ్య ఒక్క స్టేషన్‌లో కూడా స్టాప్ సదుపాయం కల్పించలేదు. దీంతో ఈ రెండు ఉమ్మడి జిల్లాల పరిధిలోని రైల్వే ప్రయాణికుల ఆశలు అడియాసలే అయ్యాయి. ఇప్పటికైనా కేంద్రం స్పందించి కొత్త రైళ్లకు పెద్దపల్లి జంక్షన్‌లో హాల్టింగ్ ఇవ్వాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

**స్టాప్‌కు నోచుకోని 'చెన్నై సెంట్రల్ సూపర్‌ఫాస్ట్'**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణలోని రైల్వే జంక్షన్లు, స్టేషన్లపై వివక్ష చూపుతున్నది. తెలంగాణ నుంచి ఎనిమిది మంది బీజేపీ, ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలు ఉన్నా రాష్ట్రానికి మాత్రం గుండు సున్నానే మిగులుతున్నది. అది మరో మారు నిజం అవుతున్నది. తాజాగా శనివారం కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కొత్త రైళ్లను ప్రారంభించారు. అందులో తెలంగాణ మీదుగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలకు 20625/26 చెన్నై భగత్‌కి కోటి ఎక్స్‌ప్రెస్ రైలు వెళ్తుంది. జోధ్‌పూర్ నుంచి చెన్నై సెంట్రల్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (వయా వర్ధా– సూరత్ –వడోదరా – అహ్మదాబాద్–బిల్డి–జాలోర్–సంధారీ–లునీ) వారానికి మినహా ఐదు రోజులు నడుస్తుంది. ఈ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని సిర్పూర్ కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మంచిర్యాల, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రామగుండం, పెద్దపల్లి, జమ్మికుంట రైల్వే స్టేషన్ల మీదుగా వరంగల్ జిల్లాలోకి ప్రవేశిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లోని ఒక్క రైల్వే జంక్షన్ గానీ, రైల్వే స్టేషన్లలో గానీ స్టాప్ ఇవ్వలేదు. కేవలం వరంగల్, ఖమ్మం రైల్వే స్టేషన్లలో మాత్రమే హాల్టింగ్ ఇచ్చారు. ఈ రైలుకు పెద్దపల్లి జంక్షన్‌లో హాల్ట్ సదుపాయం కల్పిస్తే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. స్థానికంగా నివాసం ఉండే మార్వాడీ సామాజిక వర్గంతోపాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రామగుండం, మంథని, కరీంనగర్, జమ్మికుంట, వేములవాడ, సిరిసిల్ల, జగిత్యాలతో పాటు సిద్దిపేట జిల్లా ప్రయాణికులకు రాజస్థాన్‌లోని జాలోర్, లునీ, సంధారి లాంటి ప్రాంతాలకు వెళ్లడానికి అవకాశం ఉంటుంది. పైగా ఈ రైలు సూరత్, అహ్మదాబాద్ వెళ్తున్నందున సిరిసిల్ల, వేములవాడ, జగిత్యాలలోని వస్త్ర వ్యాపారులకు ఉపయోగకరంగా ఉంటుంది. చెన్నై నుంచి భగత్‌కి కోటి వైపు ఎగువ మార్గంలో వెళ్లేటప్పుడు ఈ రైలు సంఖ్య 20625, భగత్‌కి కోటి నుంచి చెన్నై వైపు వెళ్లేటప్పుడు ఈ రైలు సంఖ్య 20626గా ఉంటుంది. చెన్నై నుంచి భగత్‌కి కోటి వైపు వెళ్లేటప్పుడు ఈ రైలు బుధ, శనివారాల్లో మినహా మిగిలిన అన్ని రోజుల్లో చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్ నుంచి సాయంత్రం 07:45 నిమిషాలకు బయలుదేరుతుంది.

**హాల్టింగ్‌తో ఎంతో ఉపయోగం**

ఒకవేళ ఈ రైలుకు పెద్దపల్లి జంక్షన్‌లో స్టాప్ సదుపాయం కల్పిస్తే ఉదయం 6గంటలకు వస్తుంది. దీంతో చెన్నైలో పని చేసే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు ఉపయోగకరంగా ఉంటుంది. భగత్‌కి కోటి నుంచి చెన్నై వైపు వెళ్లేటప్పుడు ఈ రైలు మంగళ, శనివారాల్లో మినహా మిగిలిన ఐదు రోజులు భగత్‌కి కోటి రైల్వేస్టేషన్ నుంచి ఉదయం 5:30 గంటలకు బయలుదేరుతుంది. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌కి 41.45 గంటల ప్రయాణ సమయం తర్వాత రాత్రి 11:15గంటలకు చేరుతుంది. ఒకవేళ ఈ రైలుకు పెద్దపల్లి జంక్షన్‌లో స్టాప్ సదుపాయం కల్పిస్తే జంక్షన్‌కి ఉదయం 11 గంటలకు (ఆది, బుధ వారాల్లో మినహా) వస్తుంది. దీంతో ఉదయం ఖమ్మం, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు వెళ్లే ప్రయాణికులకు ఉపయోకరంగా ఉంటుంది. దీంతో చెన్నై నుంచి భగత్‌కి కోటి నుంచి చెన్నై సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ పెద్దపల్లి జంక్షన్‌లో స్టాప్ సదుపాయం కల్పించాలని ప్రజల నుంచి డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ రైలు నిలుపాలని ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం అధ్యక్షుడు ఫణిశర్మ, పెద్దపల్లి మార్వాడీ సామాజిక వర్గం సభ్యులు దక్షిణ మధ్య రైల్వే జీయం, సికింద్రాబాద్ డీఆర్ఎంలకు మెయిల్ ద్వారా వినతి పత్రాలు సమర్పించారు. ఈ ఎక్స్ ప్రెస్ రైలులో మొత్తం 22బోగీలు ఉన్నాయి. ఇది జర్మన్ సాంకేతిక పరిజ్ఞానంతో నడిచే ఎల్‌హెచ్‌బీ రైలు కావడంతో ప్రయాణికులు ఆసక్తి చూపుతున్నారు.

**అమృత్ భారత్‌కు నో స్టాప్..**

మరికొద్ది రోజుల్లో పాట్నా నుంచి ఎస్ఎంవీటీ బెంగళూరు బై వీక్లీ 'అమృత్ భారత్' సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు (వయా వరంగల్ విజయవాడ–చెన్నై పెరంబూరు– కాట్పాడి–జోలార్ పేట్) మీదుగా ప్రారంభం కానున్నది. ఈ రైలుకి కూడా బల్లార్షా నుంచి వరంగల్ మధ్య ఒక్క స్టేషన్‌లో కూడా స్టాప్ సదుపాయం కల్పించలేదు. అతి త్వరలో ఈ రైలుకి సంబంధించిన సమయ సారినీ అందుబాటులోకి రానున్నది. ప్రస్తుతం బెంగళూరు నుంచి ప్రతిరోజూ పాట్నా వెళడానికి సంఘమిత్ర సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఉన్నప్పటికీ అందులో సాధారణ బోగీల్లో ప్రయాణికులు కిక్కిరిసి ప్రయాణం చేస్తుంటారు . పెద్దపల్లి జంక్షన్ నుంచి బెంగళూరు వెళ్లడానికి ఒక్కటంటే ఒక్క రైలుకు కూడా హాల్ట్ సదుపాయం లేదు. అదే రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి బెంగళూరుకి రైళ్లు ఉన్నాయి. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని పెద్దపల్లి జంక్షన్‌లో పాట్నా నుంచి ఎస్ఎంవీటి బెంగళూరు బై వీక్లీ అమృత్ భారత్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలుకు స్టాప్ సదుపాయం కల్పిస్తే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పని చేసే వలస కార్మికులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

# హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను కలిసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు

జ్యోతినగర్, మే 11: రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ సుజయ్‌పాల్‌ను ఆదివారం ఎన్టీపీసీ టౌన్ షిప్‌లోని జ్యోతిభవన్‌లో గోదావరిఖని బార్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా శారదనగర్ లో నిర్మిస్తున్న నూతన కోర్టు భవనాలకు నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తయ్యేలా చొరవ చూపాలని విన్నపించారు. స్పందించిన సుజయ్ పాల్ త్వరలోనే పరిష్కారిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఇక్కడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తౌటం సతీశ్, జాయింట్ సెక్రెటరీ ముచ్చకుర్తి కుమార్, కార్యవర్గ సభ్యులు రాగం శ్రీధర్‌తో పాటు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచల సునీత, ఆదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టీ శ్రీనివాసరావు, మున్సిఫ్ మేజిస్ట్రేట్ స్వారిక ఉన్నారు.



చీఫ్ జస్టిస్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

## కేంద్ర వైఖరితో కార్మిక వర్గం ఆందోళన


కరపత్రాలు విడుదల చేస్తునన నాయకులు

పెద్దపల్లి టౌన్, మే 11: కేంద్రప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో కార్మిక వర్గం తీవ్రమైన ఆందోళనలో ఉన్నదని, కార్మికుల హక్కుల సాధన కోసమే మే 20న, దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేయడం జరుగుతుందని, సమ్మెలో కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు అన్నారు, ఆదివారం సిఐటియూ కార్యాలయంలో దేశవ్యాప్త సమ్మె, భవిష్యత్ కార్యచర ణఫైన రూపొందించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భం గా ముత్యంరావు మాట్లాడారు. కేంద్రం తీరు బహు విచిత్రంగా ఉందన్నారు. కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ అమ లులోకి వస్తే 8 గంటల పనిదినం పోయి, 12 గంటల పనిదినం వస్తుందని, కార్మికులు సమ్మె చేసే హక్కును కోల్పోతారని ఆవేదన చెందారు. దీంతోపాటు కార్మికులు అనేక హక్కులు కోల్పోతారని వివరించారు. ఇక్కడ నాయకులు నరేశ్, ముస్తాఫా, రాజు, సంపత్, శ్రావన్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా మూల మలుపు


ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

సుల్తానాబాద్‌రూరల్,మే11: మండలంలోని ఐతరాజ్‌పల్లిలోని ఎల్లమ్మతల్లి ఆలయ సమీపంలోని రోడ్డు కల్వర్టు వద్ద వర్షాలకు దెబ్బతిన్నది. డాంబర్ రోడ్డు అంచుకులకు కట్ అవ్తుకుంట్ వస్తుంది. ఐతరాజ్‌పల్లి నుంచి భూపతిపూర్ గ్రామం వైపు, అలాగే ఏలిగేడు మండలంలోని సుల్తానాపూర్ వైపు వెళ్లే దారి మూలమలుపు ఉండడం దానికి తోడు రోడ్డు అంచులు దెబ్బతినడంతో ఏప్పుడు ఏ ప్రమాదం ముంచుకువస్తుందని ద్విచక్రవాహనదారులు, భారీ వాహనాదారులు, రైతులు సైతం వారి పంట పొలాలకు అ దారి వైపు నుంచి నిత్యం రాకపోకలను సాగిస్తుంటారు. కల్వర్టు వద్ద బండలతో కట్టి రోడ్డు మర్మతులను చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వేదికపై పూర్వ విద్యార్థులు

# 40 ఏళ్లకు మళ్లీ ఒక్కచోట చేరి

సుల్తానాబాద్ రూరల్,మే11: నర్సయ్యపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని విజయ గార్డెన్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం వైభవంగా నిర్వహించారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1983–84 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి గురువులు సాంబయ్య, రాంచంద్రరెడ్డి, రఘు, వెంకటేశంలను ఈ కార్యక్రమానికి పిలుచుకుని వారితో ఆప్యాయత అనురాగాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా గురువులకు శాలువాలను కప్పి , మెమోంటోలు, పుష్పగుచ్ఛలను అందించి ఘనంగా సత్కరించారు. ఉదోగ్య రీత్యా వివిధ ప్రాంతాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరు ఒకే చోట కలుసుకోవడంతో ఒకరినోకరు అప్యాయంగా పలకరించుకుని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థినులు సరదగా చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మాదూరి ప్రసాద్, శ్రీనివాస్, ఆశోక్ రావు, రంగరావు, రవీందర్ రెడ్డి, సురేశ్ రెడ్డి, వెంకటేశం, సంజీవ్, లక్ష్మణ్, మల్లేశం, రవి, శ్రీకాంత్, పద్మ, ఇందిరా, రేణుక, అంజలి, అనసూర్యలతో పాటు తదితరలు ఉన్నారు.

# కేంద్రం మావోయిస్టులతో శాంతి చర్చలు జరుపాలి

పెద్దపల్లి టౌన్, మే11: కేంద్రప్రభుత్వం తక్షణమే మావోయిస్టులతో శాంతి చర్చలు జరుపాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహయ కార్యదర్శి మాదన కుమారస్వామి కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం ఎదుట ఉమ్మడి కరీంనగర్ జిల్లా పౌరహక్కుల సంఘం 5వ, మహాసభల కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడారు. రెండు నెలలుగా దేశంలోని మేధావులు, ప్రజా సంఘాలు, న్యాయవాధులు, పౌరహక్కుల నాయకులు, వామపక్ష నాయకులు మావోయిస్టులతో శాంతి చర్చలు జరుపాలని విజ్ఞప్తి చేస్తున్నాయని తెలిపారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిలు కేంద్రానికి లేఖలు రాయడంతోపాటు ప్రసార మాధ్యమాల ద్వారా శాంతి చర్చలు జరుపాలని కోరారని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఐదో మహసభలు మే 14న, కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఫిల్మీం భవన్‌లో జరుగుతాయని అన్నారు. ఈ మహసభలకు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, వీక్షణం ఎడిటర్ ఎన్. వేణుగోపాల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క నారాయణ, శ్రీపతి రాజగోపాల్ తదితరులు హజరుకానున్నారని వివరించారు. ఇక్కడ నాయకులు పుల్ల సుచరిత, వినోద్, లక్ష్మణ్, సత్యనారాయణ, పోగుల శేఖర్, బాలసాని రాజయ్య, గుమ్మడి కుమారస్వామి, రవీందర్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.



కర పత్రాలు విడుదల చేస్తున్న పౌరహక్కుల సంఘం నాయకులు

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఓదెల, మే 11: గుంపుల మానేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకున్నట్లు పొత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేశ్ తెలిపారు. ఏలాంటి అనుమతి పత్రాలు లేకుండా వాగు నుండి అక్రమంగా ట్రాక్టర్‌లో తరలిస్తుండడంతో పట్టుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మానేరు వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చట్టరీత్యా చర్య తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

## గుంజపడుగులో వైద్య శిబిరం

మంథని రూరల్, మే 11: మండలంలోని గుంజపడుగులో శ్రీ వైద్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామస్తులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో శ్రీ వైద్య ఫౌండేషన్ సభ్యులు, మెడికవర్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి


మహేశ్(ఫైల్)

ముత్తారం, మే 11: మైదంబండ పంచాయతీ పరిధిలో ట్రాక్టర్ ఢీకొని పందుల మహేశ్ (17) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మైదంబండ గుట్ట వద్ద వంపుగా ఉన్న ప్రాంతంలో ట్రాక్టర్ పార్కింగ్ చేశారు. ఎలాంటి సపోర్టు ఏర్పాటు చేయకుండా వడ్లు లోడింగ్ చేస్తుండగా క్రమంలో ట్రాక్టర్ కిందకు వెళ్లింది. ఈ క్రమంలో మహేశ్ ట్రాక్టర్‌ను ఆపేందుకు డ్రైవర్ సీట్లో ఎక్కే ప్రయత్నం చేస్తుండగా అదుపు తప్పి కింద పడిపోగా, ట్రాక్టర్ అతనిపై నుంచి వెళ్లింది. దీంతో మహేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించే క్రమంలో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని ఎస్ఐ జీ నరేశ్ పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కారు, బైక్ ఢీ : ఒకరికి తీవ్ర గాయాలు

కాల్వశ్రీరాంపూర్, మే11: మండలంలోని ఇద్లాపూర్ శివారులో ప్రధాన రహదారిపై ఆదివారం కారు–ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం జమ్మికుంట నుంచి గోదావరిఖనికి వెళ్తున్న కారు ఇద్లాపూర్ శివారులో జాఫర్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన చొప్పరి సదానందను అతి వేగంగా వచ్చి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సదానందం కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే అతన్ని దవాఖాన కు తరలించారు. కారు అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా సదానందం ఇద్లాపూర్ లో ఉంటున్న తన మామ వద్దకు వచ్చి గ్రామంలో నుండి ప్రధాన రహదారికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

## కుదిరిన వేతన ఒప్పందం

జ్యోతినగర్, మే 11: ఎన్టీపీసీ పట్టణ ఏరియా ట్రాక్టర్ డ్రైవర్లకు కొత్తగా వేతన ఒప్పందం కుదిరినట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈ నరేశ్, ఉపాధ్యాక్షుడు చిలుక శంకర్ పేర్కొన్నారు. ఎన్టీపీసీలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆదివారం ఆయన ఒప్పంద వివరాలను వెల్లండించారు. వేతన కాలపరిమితి ముగియడంతో మోటర్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ట్రాక్టర్ యాజమానులతో మూడు దఫాలుగా జరిగిన చర్చలతో గత వేతన ఒప్పందంపై రూ.2వేలు అదనంగా పెంచినట్లు పేర్కన్నారు. పెరిగిన వేతనాలతో ప్రతి డ్రైవర్‌కు నెలకు 26 రోజులకు రూ. 17,100, ఏడాదికి రెండు జతల యూనిఫాం, జత షూ, హెల్మెట్, నెలకు 8 సబ్బులు, తువ్వాల, ఏడాదికి నెల జీతం బోనస్, 18 లీవులు, పది పండుగ సెలవులు, 15 రోజుల సర్వే ఇవ్వాలనే డిమాండ్లపై ఒప్పందం కుదిరిందని వివరించారు. ఈ నెల 1 నుంచి 2027, ఏప్రిల్ 30 వరకు ఒప్పందం అమల్లో ఉంటుందన్నారు. ఇక్కడ ట్రాక్టర్ యాజమానుల సంఘం నాయకులు శ్రీనివాసు, ఆంజనేయులు, శివకుమార్, రాజేశం, రాజేందర్, డ్రైవర్స్ యూనియన్ ప్రతినిధులు బీ కొమురయ్య, ఎడ్ల రవికుమార్, ఏ మురళి, ఎస్ తిరుపతి, బీ శ్రీనివాస్, జే స్వామి, సురేశ్, రమేశ్, కోమల రామ్, సంజీవ్, తదితరులు ఉన్నారు.